## క్లుప్తంగా

### మార్మోగిన గోవింద నామస్మరణ



శ్రీవారి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

కొమ్మాది: రుషికొండపై గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజామున సుప్రభాత సేవ, తోమాల సేవ అనంతరం భక్తులకు శ్రీవారి దర్శనం కల్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వందలాది మంది శ్రీవారిని దర్శించుకున్నారు. ఏడుకొండలవాడా... గోవిందా... గోవిందా అంటూ స్మరించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కోలాటం, అన్నమయ్య సంకీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి.

### మాధవునికి నవనీతోత్సవం నేడు



అలంకరణలో కుంతీ మాధవస్వామి

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించే నవనీతోత్సవానికి ఏర్పాట్లు చేశారు. కుంతీ మాధవ స్వామిని శనివారం రాత్రి ఒంటి గంట నుంచి అర్చక స్వాములు వెన్నతో అలంకరిస్తారు. వేకువజామున ఆరు గంటల నుంచి నవనీత అలంకరణలో ఉన్న స్వామిని దర్శించుకునేందుకు భక్తులకు అవకాశం కల్పిస్తారు.

### ట్యాబులు సద్వినియోగం చేసుకోవాలి



మద్ది హైస్కూల్‌లో ట్యాబులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: విద్యార్థులంతా ట్యాబులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కంటుబోతు రాంబాబు అన్నారు. మండలంలోని మద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులు 41 మంది, పద్మనాభం కస్తూర్బా గాంధీ విద్యాలయ విద్యార్థినులు 40 మందికి శనివారం ఆయన ట్యాబులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత పెంపొందించేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ట్యాబులు అందించే మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బుగత సత్యనారాయణ పాల్గొన్నారు.

### చెరువు అభివృద్ధి పనుల పరిశీలన



చిట్టివలస పెద్ద చెరువులో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న జెడ్పీ రాము, తదితరులు

తగరపువలస: జీవీఎంసీ 1, 2 వార్డుల పరిధిలో గల చిట్టివలస పెద్ద చెరువులో రూ.6.50 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులను జెడ్పీ బి.రాము శనివారం పరిశీలించారు. ఆరు నెలల క్రితం ఇక్కడి చెరువు అభివృద్ధికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు భూమి పూజ చేసిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ఇప్పటి వరకు పూర్తయిన పనులను వైఎస్సార్‌సీపీ నాయకులు జెడ్పీని అడిగి తెలుసుకున్నారు. త్వరతగతిన బ్యూటిఫికేషన్ పనులు పూర్తయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జెరు వెంకట రెడ్డి, నాయకులు చిల్ల బాబాయి రెడ్డి, శిల్ల వంశీరెడ్డి, చిల్ల గణేష్‌రెడ్డి, నమ్మి మాధవరావు, బోర వెంకట అప్పారావు, పీతల రాజారావు తదితరులు పాల్గొన్నారు.



# అందరి బంధువు సీఎం జగన్



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తదితరులు



మధురవాడలో పింఛన్ నగదు నమూనా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ: అందరికీ మేలు చేసే నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 5వ వార్డు మధురవాడ అయ్యన్నపాలెంలో వైఎస్సార్ పింఛన్ కానుక శనివారం పంపిణీ చేశారు. పింఛన్ల నగదు రూ.3 వేలకు పెంచినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ సీఎం జగన్ చిత్రపటానికి పింఛన్‌దారులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు చేతులెత్తి హర్షధ్వానాలు చేస్తూ ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీనివాసరావు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో కొత్తగా ఎవరికైనా పింఛన్ మంజూరవ్వాలంటే... అప్పటికే ఉన్న లబ్ధిదారుల్లో ఎవరైనా చనిపోతేనే మరొకరికి ఇచ్చే వారని విమర్శించారు. చంద్రబాబు కేవలం 31 లక్షల మందికి పింఛన్లు ఇస్తే... ప్రస్తుతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 68 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నారన్నారు. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు ప్రభుత్వం రూ.83 వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. అవినీతి, నిష్పక్షిక పాలన జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని చెప్పారు. మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, జెడ్పీ కనక మహాలక్ష్మి, వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, 5వ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ పోతిన సురేష్ కుమార్, నాయకులు ఎస్.బాల్బి, పిళ్లా సూరిబాబు, చేబోరి రజని, బండారు శివలక్ష్మి, వాండ్రాసి రవికుమార్, బగాది లక్ష్మణ, ముద్దు రామారావు, బోయ సూరిరెడ్డి, జేసీఎస్ రెడ్డి, సుజాత, రమణమ్మ, కూన రమణ, శ్యామలరావు, బోర శ్రీను పాల్గొన్నారు.



సీఎం పాలెంలో చేతులెత్తి సీఎం జగన్‌కు కృతజ్ఞతలు చెబుతున్న పింఛన్‌దారులు

#### చంద్రబాబు మాటలు నమ్మి మోసపోవద్దు

అలవికాని హామీలు ఇవ్వడం, అబద్ధాలు చెప్పడం చంద్రబాబునాయుడికే సొంతమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు విమర్శించారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో మళ్లీ ప్రజలను మోసం చేసేందుకు టీడీపీ, జనసేన నాయకులు వస్తారని, వారి మాయమాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. పీఎం పాలెంలోని అవంతి ఫంక్షన్ హాలులో శనివారం మధ్యాహ్నం పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించామన్నారు. పెద్ద మనసున్న నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని చెప్పారు. సచివాలయం, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే పాలన అందిస్తున్నామన్నారు. ఎన్నికలు రాకముందే అధికారంలోకి వచ్చేస్తామని టీడీపీ నాయకులు కలలుగంటూ అధికారులను బెదిరిస్తున్నారన్నారు. అటువంటి నాయకులకు తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. మళ్లీ జగన్ మోహన్‌రెడ్డి సీఎం అవుతారని, తాను ఎమ్మెల్యేగా గెలిచి అందరికీ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు డాక్టర్ ముత్తంశెట్టి ప్రియాంక, లొడగల అప్పారావు, వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు బొట్ల అప్పలరాజు, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ గాదె రోజిరెడ్డి, శ్రావణ్‌కుమార్, పోతిన ప్రసాద్, పోతిన ఎల్లాజీ, పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, సియాద్రి కనకరాజు, మన్యాల సోంబాబు, శివ, వరలక్ష్మి, పిళ్లా రమణ, గుంటబోయిన సంజీవ్, పోతిన సూరిబాబు, రాయిన సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ బీమా నగదు అందజేత



బీమా నగదు అందజేస్తున్న కార్పొరేటర్ కొండబాబు



వీరబల్లికి బీమా సొమ్ము, పింఛన్ నగదు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు చిల్లపేటకు చెందిన చిల్ల వీరబల్లికి వైఎస్సార్‌సీపీ నాయకులు వైఎస్సార్ బీమాతోపాటు వైఎస్సార్ పింఛన్ కానుక శనివారం అందించారు. జీవీఎంసీ ఆమె భర్త శ్రీనివాస‌రెడ్డి మృతి చెందడంతో తక్షణ సహాయం అప్పట్లో రూ.10 వేలు అందించారు. మిగిలిన రూ.90 వేల వీరబల్లి బ్యాంకు ఖాతాలో జమ చేయగా అందుకు సంబంధించిన లెటర్, కొత్తగా మంజూరైన రూ.3 వేల పింఛన్ నగదు అందించారు. ప్రభుత్వం వీరబల్లి కుటుంబానికి అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కర‌రెడ్డి, బింగి హరికిరణ్‌రెడ్డి, మునకాల ఆదినారాయణరెడ్డి, దల్లి అప్పలరెడ్డి, జెరు వేణుబాబు, నరగడ శివాజీనాయిరెడ్డి, పూతి దుర్గారెడ్డి, గాలి ఈశ్వరరావు, సచివాలయ అడ్మిన్ కిషోర్, వెల్ఫేర్ అసిస్టెంట్ కళ్యాణ్, వలంటీర్లు చిల్ల శ్రీను, చిల్ల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ ప్రాంతానికి చెందిన గుడ్ల నర్సింగ్ ఇటీవల ప్రమాదవశాత్తు చనిపోవడంతో ఆయన భార్య మల్లీశ్వరికి వైఎస్సార్ బీమా నగదు శనివారం అందించారు. కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పాల రమణారెడ్డి, నాయకులు దుంప సత్యం, గుడ్ల కొండ, వేమల ఈశ్వర్‌రెడ్డి, విష్ణు, సోను తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నడవడిక అత్యంత కీలకం



డిగ్రీ పట్టాలు అందుకున్న అవంతి విద్యార్థులతో సీపీ రవిశంకర్, ఎమ్మెల్యే శ్రీనివాసరావు



మాట్లాడుతున్న సీపీ రవిశంకర్

- నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్

తగరపువలస: విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత కూడా విద్యార్థులకు నడవడిక అత్యంత ప్రధానమని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ అన్నారు. అవంతి గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు చెరుకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి సీపీ మాట్లాడారు. జీవితంలో ప్రతీ క్షణం ముఖ్యమైనదన్నారు. తల్లిదండ్రులు కష్టించి పనిచేస్తూ పిల్లలను ఉన్నత స్థానంలో చూడాలనుకుంటారని, వారి కలలను సాకారం చేయాలని పిలుపునిచ్చారు. దారి తప్పితే కెరీర్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. చిత్తశుద్ధితో కష్టపడి చదువుకున్న వారికి ఉన్నత ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. చెడు అలవాట్లకు లోనై ఆరోగ్యాన్ని పాడు చేసుకోవద్దని హితవు పలికారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ చెరుకుపల్లి, గరివిడి, మాకవరపాలెం, భోగాపురంలోని తమ విద్యాసంస్థలకు చెందిన 800 మందికి ప్రశంసాపత్రాలు, గ్రాడ్యుయేషన్ పట్టాలు అందిస్తున్నట్టు తెలిపారు. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా సాంకేతికలపై విద్యార్థులు దృష్టి సారించాలన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు, రజత పతకాలు అందించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏఈ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వరపేష్, ఏపీఎస్‌సీహెచ్ఈ వైస్ చైర్మన్ కె.రామమోహన్ రావు, టాలెంట్ ఎక్విజిషన్ ప్రతినిధి టి.సురేష్‌కుమార్, ఇన్ఫోసిస్ విశాఖ యూనిట్ మేనేజర్ ఎ.కృష్ణప్ప, అవంతి విద్యాసంస్థల ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం.ప్రియాంక, వైస్ చైర్మన్ శివ సంతోష్, మేనేజింగ్ డైరెక్టర్ ఐ.శ్రవణ్‌కుమార్, డైరెక్టర్లు ఆకుల రంగ ప్రసాద్, రాఘవరావు, ప్రిన్సిపాళ్లు బి.మురళీకృష్ణ, జె.మోహన్‌రావు, గోవిందరావు, జాషువా జయప్రసాద్, ఎంపీటీ రాజు, పిన్నింటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### జ్యూట్‌మిల్లు భూముల సర్వే అడ్డగింత

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లుకు చెందిన సర్వే నంబర్ 10/1లో శనివారం సర్వే చేయడానికి వచ్చిన సర్వేయర్ కృష్ణారావును మిల్లు ఇంటక్ నాయకులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వర్కింగ్ ప్రెసిడెంట్ జీరు వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి చిల్ల వెంకటరమణ మాట్లాడుతూ కార్మికులకు మిల్లు యాజమాని సుమారు రూ.3 కోట్ల బకాయిలు ఇంకా చెల్లించలేదన్నారు. మిల్లు ఆస్తులపై ఐక్య కార్మిక సంఘాలతో అటాచ్‌మెంట్ ఉన్నందున ముందుగా బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. మిల్లు యాజమాన్య ప్రతినిధి లలితమోహన్ సర్వే చేయాలని ఆన్‌లైన్‌లో కోరగా కృష్ణారావు వచ్చినట్టు తెలిపారు. సర్వే సమాచారం కార్మిక సంఘాలకు తెలియకుండా జరుగుతుందన్నారు. ఈ విషయంపై మిల్లు యాజమాన్యంపై ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తహసీల్దార్ రమేష్‌కు ఫిర్యాదు చేయనున్నామని తెలిపారు.

# పరిశోధనలకు పుట్టినిల్లు భారత్



విద్యార్థులు ప్రదర్శించిన నమూనాను తిలకిస్తున్న నరసింహారావు, తదితరులు

ఆనందపురం : విద్యార్థులు తమ మేధస్సుకు పదునుపెట్టి రూపొందించిన వైజ్ఞానిక ప్రదర్శనలో ఉంచిన వివిధ రకాల నమూనాలు వారి ఆలోచనా విధానాలకు అద్దం పట్టాయని ఏయూ ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ నరసింహారావు అన్నారు. మండలంలోని గుడిలోవలో ఉన్న విజ్ఞాన విహార్ విద్యాలయం వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ చిన్న వయస్సులోనే విద్యార్థులు రూపొందించిన నమూనాలు అందరినీ ఆలోచింపజేసేలా ఉన్నాయన్నారు. భారతదేశం పరిశోధనలకు పుట్టినిల్లు వంటిదని, శాస్త్రవేత్తలను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు తమ మేధస్సుకు పదును పెట్టాలన్నారు. పాశ్చాత్య పోకడలకు పోకుండా భారతీయ సంస్కృతి సంప్రదాయాలను కాపాడేందుకు విద్యార్థులు శక్తి సామర్థ్యాలు వినియోగించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనలో ఉంచిన నమూనాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. భవిష్యత్తులో మనిషి లను అందరిల్లోకి తీసుకెళ్లే రోబోట్ నమూనా, హైబ్రిడ్ సోలర్ మిస్సైల్, ఐఎన్ఎస్ ఇంఫాల్ యుద్ధనౌక, మందులు తయారీ పరిశ్రమ, కృత్రిమ గర్భం యంత్రం నమూనా, బీ ఫ్యాంటేషన్, భారతీయ సంస్కృతిని తెలిపే నమూనా, చిత్రకళా పోటోలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. వివిధ పాఠశాలల విద్యార్థుల ప్రదర్శనలను తిలకించారు.

### ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో దివ్యాంగుల ప్రతిభ వెలుగులోకి... హిడెన్ స్పార్క్స్‌కు చెందిన దివ్యాంగ బాలలు శనివారం సందడి చేశారు. ఈ నెల 10, 11న నిర్వహించనున్న జాతీయ స్థాయి యువజనోత్సవం గీతం ఎక్సెలెన్స్ మీట్ – 2024లో భాగంగా నిర్వాహకులు దివ్యాంగ బాలలతో సాంస్కృతిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. మహిళాసుర మర్దిని, నరసింహ అవతారం వంటి పురాణ ఘట్టాలను విద్యార్థులు ప్రదర్శించిన తీరు అబ్బురపరిచింది.

### థీమ్ పెయింటింగ్ పనులు పూర్తి



థీమ్ పెయింటింగ్‌పై అవగాహన కల్పిస్తున్న ప్రధానోపాధ్యాయుడు జనార్దనరావు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ డివీస్ లేబొరేటరీ యాజమాన్యం శ్రీకామనాథ్ ప్రాథమిక పాఠశాలలో రూ.1.04 లక్షలతో థీమ్ పెయింటింగ్ పనులు పూర్తి చేసింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు బి.జనార్దనరావు మాట్లాడుతూ పలు రకాల అంశాలపై విద్యార్థులకు అవగాహన కలిగించడానికి రంగుల చిత్రాలు దోహదపడతాయన్నారు. ఇందుకు డివీస్ లేబొరేటరీ సహకారం అందించిందన్నారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ అధికారులు డి.సురేష్‌కుమార్, పి.శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో 'వికసిత్ భారత్' కార్యక్రమాలు



చిప్పాడలో పీఎం సురక్ష బీమా కార్డులు లబ్ధిదారులకు అందిస్తున్న నాయకులు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ, పెదనాగమయ్యపాలెం పంచాయతీల్లో శనివారం వికసిత్ భారత్ కార్యక్రమాల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగించారు. పీఎం సురక్ష బీమా ద్వారా రూ.20 ప్రీమియంతో రూ.2 లక్షల రక్షణ సదుపాయం పొందవచ్చని బీజేపీ భీమిలి కన్వీనర్ కె.రామానాయుడు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంపాడ సూరిబాబు, తోట ఎల్లారావు, ఆర్థిక అక్షరాస్యత జిల్లా కౌన్సిలర్ ఎస్.మధుసూదన్, బ్యాంకు ప్రతినిధి లక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ అప్పల, హెచ్‌పీ గ్యాస్ కో ఆర్డినేటర్ ఎం.రాజు, నిమ్మనాయుడు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

# ముస్సిపల్ కార్మికుల వినూత్న నిరసన

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్ కార్యాలయం ఆవరణలో మున్సిపల్ కార్మికులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. సూర్య నమస్కారాలు మాదిరిగా పడుకుని నిరసన చేపట్టారు. వీరు తమ డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న సమ్మె శనివారం నాటికి 12వ రోజుకు చేరింది. ఈ క్రమంలో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోవడంతో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి తరలించేందుకు చర్యలు చేపడుతున్నారు. అయితే చెత్త తరలించే వాహనాలను కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో అడ్డగించడంతో పీఎం పాలెం పోలీసులు 34 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో కార్మికులు, నాయకులు కె.నాగరాజు, వి.సంధ్య, ఎ.నరేంద్ర, జె.లలిత, బి.రూప, క్లాప్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు ఎస్.రాములప్పడు, సిహెచ్ శేషుబాబు తదితరులు ఉన్నారు.

# పండగలా పింఛన్ల పంపిణీ



కేజీహెచ్‌లో సత్యానికి డయాలసిస్ పింఛన్ రూ.10 వేలు అందిస్తున్న వలంటీర్ మొకర దుర్గ



రాజవీధిలో మస్తానరావుకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ మౌనిక, తదితరులు



చిల్లపేటలో వృద్ధురాలు అప్పయ్యమ్మకు పింఛన్ నగదు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస : గ్రామాలు, పట్టణాల్లో పండగ వాతావరణంలో వైఎస్సార్ పింఛన్ కానుక నగదు లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ దూరంగా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారి వద్దకు కూడా వలంటీర్లు నేరుగా వెళ్లి పింఛన్ నగదు అందిస్తున్నారు. భీమిలి మండలం దాకమర్రి పంచాయతీకి చెందిన డయాలసిస్ పేషెంట్ వంపాన సత్యం నగరంలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతుండగా... సచివాలయ వలంటీర్ మొకర దుర్గ శనివారం ఆస్పత్రికి వెళ్లి పింఛన్ నగదు రూ.10వేలు అందించారు. జీవీఎంసీ ఒకటో వార్డు గాంధీబొమ్మ వీధిలో ఇటీవల అస్వస్థతకు గురై ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న సందిగం మస్తానరావుకు వైఎస్సార్‌సీపీ ఎస్ అధ్యక్షుడు అక్క రమణి రామునాయుడు, సచివాలయ జీఎస్ఆర్ తమ్మిన నరసింగరావు, వలంటీర్ సరగడ మౌనిక రూ.3వేలు అందించారు. 2వ వార్డు ఆదర్శనగర్ సచివాలయం పరిధిలో నివసిస్తూ నగరంలోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్న దల్లా రాజేశ్వరి వద్దకు వలంటీర్ నాగలక్ష్మి వెళ్లి వృద్ధాప్య పింఛన్ నగదు రూ.3వేలు అందించారు. చిల్లపేటలో వృద్ధురాలు చిల్ల అప్పయ్యమ్మకు వైఎస్సార్‌సీపీ నాయకులు చిల్ల భాస్కర్‌రెడ్డి, బింగి హరికిరణ్‌రెడ్డి, మునకాల ఆదినారాయణరెడ్డి తదితరులు పింఛన్ అందించారు.

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్‌లోని 5, 6, వార్డుల్లో వైఎస్సార్ పింఛన్ కానుక నగదు ఉత్సాహంగా పంపిణీ చేశారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బందితోపాటు వైఎస్సార్‌సీపీ గృహ సారథులు, నాయకులు పాల్గొన్నారు.



కే 3 కాలనీలో పింఛన్ అందిస్తున్న వలంటీర్



ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రిలో రాజేశ్వరికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ నాగలక్ష్మి



మారికవలస ఆర్‌జేకే కాలనీలో పింఛన్ నగదు అందిస్తున్న దృశ్యం

### ఇగ్నో ప్రవేశాలు ప్రారంభం

ఎంవీపీకాలనీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) 2024 విద్యా సంవత్సరం జనవరి ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ మేరకు ఇగ్నో విశాఖ ప్రాంతీయ కేంద్ర సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇగ్నో ద్వారా అందిస్తున్న డిగ్రీ, పీజీ, డిప్లమా, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. ఈ ప్రవేశాల పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరుగనున్నాయి. కేంద్రం పరిధిలోని 11 జిల్లాల విద్యార్థులు ప్రవేశాలు కల్పించనున్నారు. https://ignouadmission. samarth. edu. in/ ద్వారా అర్హులైన విద్యార్థులు ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. జనవరి 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి.

### బెల్టు షాపులపై దాడులు

విశాఖ సిటీ : విశాఖలో బెల్టు షాపులపై పోలీసులు దాడులు నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథరావు ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో జరిగిన ఈ తనిఖీల్లో 294 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. గాజువాక హైస్కూల్ రోడ్డు ఉన్న బెల్టుషాపులో 39 క్వార్టర్ బాటిళ్లు, దువ్వాడ జేఎన్ ఎన్‌యూఆర్ఎం కాలనీలో ఒక షాపులో 59, అనందపురం గొట్టిపల్లి కల్లాలు వద్ద ఒక షాపులో 8 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే భీమిలి పరిధిలో బోయిలూరు అగ్రహారంలో ఒక షాప్‌లో 38, పీఎంపాలెం సాయిరామ్‌కాలనీలో ఒక బెల్టుషాపులో 11, పెందుర్తి పరిధిలో పినగాడిలో ఉన్న షాపుల్లో 139 క్వార్టర్ బాటిళ్లు సీజ్ చేసి సంబంధిత పోలీస్‌స్టేషన్లకు అప్పగించారు.

# రాతి శిలా విగ్రహాల గ్యాలరీ ప్రారంభం



గ్యాలరీలో రాతి విగ్రహాలు

మధురవాడ: ఆధునిక కళలను విశాఖ వాసులకు పరిచయం చేసేందుకు ఏర్పాటు చేసిన ఆర్ట్ గ్యాలరీలో రాతి విగ్రహాలు విశేషంగా ఆకట్టుకున్నాయని మేయర్ గొలగాని హరివెంకట కుమారి అన్నారు. పీఎం పాలెం సాంకేతిక కళాశాల సమీపంలో ఏర్పాటు చేసిన గ్యాలరీని శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ ప్రజలకు రాతితో చేసిన శిలా విగ్రహాలు పరిచయం చేయడం అభినందనీయమన్నారు. నిర్వాహకులు సన్యల మహాపాత్, కీర్తిని అభినందించారు. బౌద్ధారామ కళాకారులను ప్రోత్సహించేందుకు త్వరలో వర్క్‌షాపులు నిర్వహిస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు జి.శ్రీనివాస్, సీనియర్ కళాకారుడు దవిలి అప్పారావు, డి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పారిశ్రామికవేత్తలకు దిక్సూచి ఇంక్యుబేషన్ సెంటర్



ఇంక్యుబేషన్ సెంటర్ ప్రారంభిస్తున్న బీఈఎల్ రో

ఆనందపురం : వర్ధమాన పారిశ్రామికవేత్తలకు ఇంక్యుబేషన్ సెంటర్లు దిక్సూచిగా ఉపయోగపడతాయని ప్రముఖ శాస్త్రవేత్త, సంఘ సేవకుడు బి.ఆర్.ఎల్.రో చెప్పారు. మండలంలోని గంభీరంలో ఉన్న విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (విఐఎం)లో శనివారం వాణి రో మెమోరియల్ ఇంక్యుబేషన్ సెంటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్ధమాన పారిశ్రామికవేత్తలకు అన్ని రకాల సలహాలు, సహకారం అందించడానికి తన కుమార్తె పేరుతో ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు చేసి ఆర్థిక సహకారం అందిస్తున్నామని వివరించారు. యువ పారిశ్రామికవేత్తలు వినియోగించుకొని ప్రపంచ స్థాయిలో పోటీపడాలని ఆకాంక్షించారు. విఐఎం డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ మహిళా పారిశ్రామికవేత్తల్లో పోటీతత్వం పెంపొందించడానికి మిస్ వాణిరో పేరుతో బంగారు పతకాలు అందిస్తున్నారని, దీనివల్ల చాలా మంది స్ఫూర్తి పొందుతున్నారని వివరించారు. సంస్థ డైరెక్టర్ (అకడమిక్స్) ప్రొఫెసర్ ఎం.ఎస్.జావేద్ మాట్లాడుతూ ఇక్కడ సెంటర్‌ను ప్రపంచస్థాయిలో తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఇంక్యుబేషన్ సెంటర్ ఫౌండేషన్ డైరెక్టర్ దీపికా గుప్తా తదితరులు పాల్గొన్నారు.